వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సౌరభం

కార్తీక పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరుస్తోంది. ఆలయాలన్నీ ప్రత్యేక పూజలతో అలరారుతున్నాయి. మహిళలు పౌర్ణమి పూజలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు.

- కనులపండువగా కార్తీక దీపోత్సవం
- దీపహారతులతో దేదీప్యమైన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో మహిళల పౌర్ణమి పూజలు


పాలు, పెరుగు యధుమేళాలో పాల్గొన్న పీతల వాసు


రాధాకృష్ణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


ఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు


గాజుల అలంకరణలో గౌరీ పరమేశ్వరులు


గ్రంథాలయ ఆవరణలో ప్రత్యేక అలంకరణ

దాబాగార్డెన్స్: కార్తీక పౌర్ణమి, కృత్తికా నక్షత్రం సందర్భంగా నగరంలోని మహారాణిపేటలో గల కనక మహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని దీపారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణుల మహోత్సవం..

అల్లిపురం: కార్తీక పౌర్ణమి సందర్భంగా అల్లిపురంలోని నేరెళ్లకోనేరు కాలనీలో శుక్రవారం ఒడియా బ్రాహ్మణుల ఆధ్వర్యంలో రాధాకృష్ణుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు విశేష అభిషేకాలు, పూజల అనంతరం మధ్యాహ్నం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమాలలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు పాల్గొని పూజలు చేశారు.

గాజుల అలంకరణలో గౌరీ పరమేశ్వరులు..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వెంకటేశ్వరమెట్టలోని శ్రీ గౌరీ పరమేశ్వరులు గాజుల అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గత నెల 23వ తేదీ నుంచి గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రంథాలయ అధ్యక్షుడు పాలమరశెట్టి శ్యామ్, కార్యదర్శి పాలమరశెట్టి శ్రీను తెలిపారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీప స్తంభాలతో గ్రంథాలయ ప్రాంగణాన్ని అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు.


అంబికాబాగ్ సీతారామ చంద్రస్వామి ఆలయం

ఘనంగా మన్యుసూక్త హోమం..

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం జరిగిందని, అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశామని ఆలయ ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా యధుమేళ..

దాబాగార్డెన్స్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జీవీఎంసీ 29వ వార్డు సెంచురీక్లబ్ జంక్షన్‌లో శ్రీకృష్ణా యూత్ ఆధ్వర్యంలో రాధా కృష్ణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాలు, పెరుగు యధుమేళా ఘనంగా నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల వాసు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

వంకలదిబ్బ యూత్ ఆధ్వర్యంలో..

జీవీఎంసీ 29వ వార్డు ఊటగెడ్డలో శ్రీ కృష్ణ సేవా సమితి, వంకల దిబ్బ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాధా కృష్ణ మహోత్సవంలో జరిగిన యధుమేళాలో జనసేన పార్టీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి ఆలయంలో..

అల్లిపురం: వారాహి అమ్మవారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పాటలతో పాటు శివ నామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.

ఘనంగా పరస మహోత్సవం..

కార్తీక పౌర్ణమి సందర్భంగా వెంకటేశ్వరమెట్టపై, శ్రీ గౌరీ పరమేశ్వరుల పరస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయంలో గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిని ప్రత్యేకంగా అలంకరించి దీపాలతో విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరస తిలకించేందుకు బంగారుమెట్ట, అల్లిపురం మెయిన్ రోడ్డు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పరసలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం వంటి ఆట వస్తువులతో చిన్నారులు సరదాగా గడిపారు. గౌరీ పరమేశ్వరుల వద్ద ప్రత్యేక దీపాలంకరణ సేవ చేపట్టారు. అమ్మవారికి ప్రత్యేక దీప హారతులను అర్చకులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

'ఏవీఎన్'లో డయాబెటిస్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్


పరీక్షలు చేయించుకుంటున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో డయాబెటిస్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు స్క్రీనింగ్ టెస్టులు చేయించుకున్నారు. కార్యకరమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి అర్చన, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏడీకి అభినందనలు


కేజీహెచ్ ఏడీ అప్పారావును అభినందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన)గా బాధ్యతలు స్వీకరించిన పీఎస్ అప్పారావును రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర సలహాదారు డీడీ ప్రసాదరావు శుక్రవారం అభినందించారు. పలువురు పెన్షనర్లతో కలిసి అప్పారావుకు మొక్క అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ డాక్టర్ సుధకు పదోన్నతి


డాక్టర్ కర్రి సుధ

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన లెక్చరర్ డాక్టర్ కర్రి సుధకు పదోన్నతి లభించింది. నర్సీపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. 2008 నుంచి చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా 16 ఏళ్ల పాటు సేవలందించారు. 2014లో స్టేట్ బెస్ట్ లెక్చరర్ అవార్డు, 2019లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు పొందారు. హిందీ భాష సాహిత్యాలకు ఆమె చేస్తున్న సేవకు గుర్తింపుగా బీహార్ హిందీ సాహిత్య సమ్మేళన్, పాట్నా శతాబ్ది సమ్మాన్ అవార్డులు అందుకున్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి


కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

దాబాగార్డెన్స్: సూపర్ స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి శుక్రవారం సరస్వతీ పార్క్ వద్ద నిర్వహించారు. విశాఖపట్నం కృష్ణ అండ్ మహేష్‌బాబు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమాన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ లేకపోవడంతో తెలుగు సినిమా పరిశ్రమకు చాలా లోటు కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో రమణ, యాదవ్, అప్పారావు, సుబ్రహ్మణ్యం, శ్రీను, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

24న ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన


పిక్నిక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న పోతినమల్లయ్యపాలెం సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ మైదాన ప్రాంగణంలో కార్తీక వన సమారాధన ఏర్పాటు చేసినట్టు సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు, కార్యదర్శి కేఎస్ రామారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన వాసవీ భవన్‌లో నిర్వహించిన కార్యాలయంలో పిక్నిక్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలో పిల్లలకు ఆటలు, పాటల పోటీలు, నృత్య ప్రదర్శనలు, మహిళలు, పురుషులకు ఉత్సాహపరిచే వివిధ రకాల గేమ్స్, తంబోలా, లక్కీ డ్రాలు, పెద్దలకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆర్యవైశ్యుల ఆత్మీయ కలయికలో విశాఖలో గల ఆర్యవైశ్యులందరూ కుటుంబాలతో సహా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్తీక వన సమారాధనలో పాల్గొనదలిచే ఆర్యవైశ్యులు ముందుగా నామమాత్రపు రుసుము చెల్లించి ప్రవేశ బ్యాడ్జీలు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 0891-2569410, 9246800766 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీవీఎస్ఎస్‌వీ సాంబమూర్తి, పాలూరి వరప్రసాద్, కంకటాల సతీష్, బోనగిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

21న జీవీఎంసీ దుకాణాలకు వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4 పరిధిలో గల పలు దుకాణాలు, కల్యాణ మండపం, మార్కెట్లకు బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్-4 పరిధిలో గల 35వ వార్డు స్ప్రింగ్ రోడ్డు సమీపాన డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో 9, 10, 11, 12, 13 (జనరల్), 15 (ఎస్సీ), మొదటి అంతస్తులో దుకాణం నంబర్లు 2 (ఎస్సీ), 3,4,5,6,7,9,10,11,12,13,14,15 (జనరల్)కు, జగదాంబ వాణిజ్య సముదాయంలో గల గదులు 3, 5, 13, 14 (ఎస్టీ)కు, 35వ వార్డు పాత బస్టాండ్ ఫేస్-2లో 1,2,3,4,5,6,7,8,10,11,12,13,14 (ఎస్సీ), 9 (ఎస్టీ), 39వ వార్డు పద్మానగర్ వాణిజ్య సముదాయంలో 1,4,6,7,11,12 (జనరల్), 8 (ఎస్సీ) గదులు, 31వ వార్డు సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం ఫస్ట్ ఫ్లోర్‌లో దుకాణం నంబరు 9, 37వ వార్డు అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు మార్కెట్, రెల్లివీధి రోడ్‌సైడ్ మార్కెట్లను బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి


కైలాసపురంలో పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డులో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అధికారులను ఆదేశించారు. వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి నుంచి కైలాసపురం కొండవాలు ప్రాంతానికి వెళ్లే రహదారిలో జరుగుతున్న గెడ్డ నిర్మాణ పనులు, డ్రైనేజీల నిర్మాణం, రిటైనింగ్ వాల్ పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కైలాసపురం-తాటిచెట్ల పాలెం పరిధిలో 80శాతం అభివృద్ధి పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఇంజినీరింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ.నరేష్‌స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత


దీనులకు నిత్యావసర సరకులు అందిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా టీపీఆర్ కాంప్లెక్స్‌లోని ఆశ్రయ హోమ్ ఫర్ ది హోంలెస్‌లో విస్తృతంగా దీనులకు శ్రీ సత్య సాయి విద్యా విహార్ పదవ తరగతి ఈ-సెక్షన్ విద్యార్థులు సేవలందించారు. బియ్యం, కందిపప్పు, మినపప్పు, సెనగ పప్పు, ఇడ్లీ రవ్వ, బెల్లం, వేరుసెనగలు, సూజి, రాగి, పెసర పప్పు, పోహా, వంట నూనె, ఆటా, ఫినైల్ సీసాలు, టాయిలెట్ కిట్లు, నైటీలు, తువ్వాళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

సముద్ర గస్తీపై శిక్షణ


మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు శిక్షణ ఇస్తున్న ఐఎన్ఎస్ ఘరియాల్ అధికారి

ఎంవీపీకాలనీ: సముద్ర భద్రత కోసం ఐక్య ఫ్రంట్‌లో భాగంగా ఐఎన్ఎస్ ఘరియాల్ అధికారులు మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు ఉమ్మడి గస్తీపై శిక్షణ ఇచ్చారు. మొజాంబిక్‌లోని పోర్ట్ నకాలా నుంచి ఈ నెల 12న ఐఎన్ఎస్ ఘరియాల్ బయలు దేరిన సమయంలో ఈ శిక్షణ జరిగింది. జాయింట్ ఈఈజెడ్ గస్తీ, సముద్ర రైడర్లకు ఎన్‌బీసీడీ, వీబీఎస్ఎస్, ఇంజిన్ అండ్ స్విచ్‌బోర్డ్ నియంత్రణలపైనా మొజాంబికన్ దళాలకు శిక్షణ అందించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి


విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: విద్యార్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. సీతమ్మధారలోని నవోదయ జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని.. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయవద్దని హితవు పలికారు. వాహనాలు నడిపేవారంతా మొబైల్ ఫోన్లలో మాట్లాడరాదని స్పష్టం చేశారు. రోడ్డు దాటే పాదచారులు మొబైల్‌ఫోన్లలో మాట్లాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చాలామంది ఆర్టీసీ సిటీబస్ ఫుట్‌బోర్డుల మీద వేలాడుతూ ప్రమాదభరితంగా ప్రయాణిస్తున్నారని, ఇది ప్రమాదకరమని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిష్టించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అత్యవసరమైన వారికి, తలసేమియా చిన్నారులకు సమయానికి రక్తం అందజేయటం, ఉచిత రక్త మార్పిడి, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్న రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో మహారాణిపేట ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అదే భవనంలో నిర్వహిస్తున్న తలసేమియా కేంద్రాన్ని సందర్శించిన ఆయన వ్యాధితో బాధ పడుతున్న చిన్నారులను పరామర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ వైఎస్ శివ నాగేంద్ర రెడ్డి, మేనేజింగ్ కమిటీ మెంబర్లు, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా చైర్మన్ టి.ఆర్. మక్సూద్ అహ్మద్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ప్రజలు మూర్ఛ వ్యాధి పట్ల అపోహలు తొలగించుకోవాలని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. శుక్రవారం ఏఎంసీ సెమినార్ హాల్లో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని (సీఎంఈ) జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశంలో ఏటా మూర్ఛ రోగ వారోత్సవాలు జరుగుతున్నాయని అందులో భాగంగా న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో సీఎంఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు శాతం ప్రజలు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిపారు. బాధితుల పట్ల కుటుంబ సభ్యుల్లో మూఢ నమ్మకాలు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. మూర్ఛలో మేజర్, మైనర్ ఉండగా, 90 శాతం నివారణ అవుతాయి అన్నారు. ఈ వ్యాధికి రెండు దశాబ్దాలుగా 30 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, కొన్ని రకాల ఆపరేషన్లు కూడా చేస్తున్నామన్నారు. ఇది మెదడుకి సంబంధించిన వ్యాధి అన్నారు. కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసుపల్లి రవి మాట్లాడుతూ మూర్ఛ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలి అన్నారు. ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎస్. గోపి, న్యూరో సర్జరీ డాక్టర్ ప్రేమ్ జిత్ రే, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రైడేతో ఆరోగ్య రక్షణ


ప్రసాద్‌గార్డెన్స్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రసాద్ గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం సందర్భంగా యూపీహెచ్‌సీ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, వీటి వలన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే-డ్రైడే పాటించాలన్నారు. ప్రసాద్‌గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది హాజరును డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మలేరియా సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనకు స్పందన


బాలల శాఖా గ్రంథాయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు తిలకిస్తున్న విద్యార్థులు

అల్లిపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు విద్యార్థుల నుంచి స్పందన ఏర్పడింది. అల్లిపురం పరిసర ప్రాంతాలలో గల పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రంథాలయంలో ప్రదర్శించిన పుస్తకాలను చదివి విశేషాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ నూకరాజు, ఉపాధ్యాయులు వి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి బి. పైడప్పనాయుడు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. నవలలు, కథలు, డిక్షనరీలు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఆధ్యాత్మిక, సాహితీ, పిల్లల పుస్తకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పైడప్పనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక ప్రదర్శనను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎల్ఆర్ వర్మ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

పూర్ణామార్కెట్ దరి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాయంలో పుస్తక ప్రదర్శన చేపట్టారు. ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే ఆల్ కాంపిటీటివ్ బుక్స్ ఉన్నాయని, ప్రతి విద్యార్థి ఈ పుస్తకాలను వినియోగించుకుని చక్కటి ఉద్యోగాలు సంపాదించుకోవాలని తెలిపారు. గ్రంథాలయాధికారి టి. పోలితల్లి, వివిధ పాఠశాలల పిల్లలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం


పుస్తకాలు పరిశీలిస్తున్న కవి, వైద్యుడు డాక్టర్ నాయక్ తదితరులు

సీతమ్మధార: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రముఖ కవి, వైద్యుడు డాక్టర్ ఆర్.ఎ. నాయక్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ద్వారకానగర్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మద్యం, గంజాయి, ధూమపానం వంటివి ఆరోగ్యానికి హానికరమన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు రచనలు అమూల్యమైనవి అన్నారు. నిరంతర పఠనంతో విజ్ఞానం పెంపొందించుకుని ఉద్యోగాలు సంపాదించుకోవడమే కాక సమాజంలో మంచి పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు. గెజిటెడ్ లైబ్రేరియన్ పద్మావతి సభకు అధ్యక్షత వహించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.